# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహిస్తున్నారు.**

**2. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండో విడత ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ జారీ చేసింది.**

**3. తెలంగాణలోని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి ఉపఎన్నిక కొనసాగుతోంది.**

**4. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండవ అఖిల భారతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభా సమారోహం-2024 ప్రారంభమైంది.**

**5. ప్రకాశం జిల్లా టంగుటూరు సమీపంలో జాతీయ రహదారిపై ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందారు.**

==========================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన సంబంధిత శాఖల పనితీరును అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సమావేశంలో అదనపు ముఖ్యకార్యనిర్వహణాధికారి కోటేశ్వరరావు, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్ దేవకుమార్, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వాసుదేవరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఎం.రవిప్రకాశ్ పాల్గొన్నారు. వీరితో పాటు విశాఖపట్నం, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు, విశాఖపట్నం, విజయవాడ పోలీస్ కమిషనర్లు ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు.

--------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండో విడత ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ జారీచేసింది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలతో పాటు ఔటర్ మణిపూర్‌లోని ఒక స్థానానికి ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని.. ఏప్రిల్ 4వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉందని ఎన్నికల సంఘం పేర్కొంది.

--------------------------

తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి ఉప ఎన్నిక ప్రశాంతంగా కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంకాలం 4 గంటల వరకు జరగనుంది. దీనికోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున మన్నె జీవన్‌రెడ్డి, భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ పోటీ చేస్తున్నారు. మరికాసేపట్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కొడంగల్ శాసనసభ్యులు ఎ.రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

---------------------------

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండవ అఖిల భారతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభా సమారోహం–2024 అట్టహాసంగా ప్రారంభమైంది. సంస్కృత విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజుల కార్యక్రమాన్ని కులపతి ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి ఈరోజు ప్రారంభించారు. 21 రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కృష్ణమూర్తి ఆకాశవాణితో మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రతిభా సమారోహం నిర్వహిస్తున్నామని.. అందులో భాగంగా వకృత్వ, సాంస్కృతిక, క్రీడా పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల్లో మేథోసంపత్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన వివరిస్తూ...

**....వాయిస్.... 30 సెకన్లు....**

---------------------------

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 10వ తేదీ వరకు tstet2024.aptonline.inలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం.. ఆన్‌లైన్ ఆధారిత టెట్ పరీక్ష మే 20వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ మధ్య రెండు సెషన్లలో నిర్వహిస్తారు. మే 15వ తేదీ నుంచి హాల్‌టికెట్లు అందుబాటులోకి వస్తాయి. టెట్ ఫలితాలు జూన్ 12వ తేదీన విడుదల చేస్తారు. కాగా.. తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే "ఎప్‌సెట్"కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షా కేంద్రాలను పెంచామని అధికారులు తెలిపారు. గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో తగినన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని, ఆ రాష్ట్ర అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సెట్ నిర్వహణ బాధ్యత చేపట్టిన జేఎన్‌టీయూను టీఎస్ ఎప్‌సెట్ ఉన్నతాధికారులు ఆదేశించారు.

---------------------------

ప్రకాశం జిల్లా టంగుటూరు సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. కందుకూరు వైపు వెళుతున్న కారు టంగుటూరు సమీపంలోని నాయుడుపాలెం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడటంతో ఈ ప్రమాదం జరిగిందని సింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు ఘటనా స్థలంలో మృతి చెందారని.. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు గాయపడ్డారని వెల్లడించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించామని సీఐ తెలిపారు. క్షతగాత్రులను ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

---------------------------

పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తమ ప్రభుత్వం గత 58 నెలల కాలంలో అనేక పథకాలు ప్రవేశపెట్టిందని రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేపట్టిన ఆయన ఈ ఉదయం నంద్యాల జిల్లా ఎర్రగుంట్లలో ప్రజలు, మేధావులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి ప్రజల నుంచి తన పాలనపై సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామని.. ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని గణాంకాలతో వివరించారు.

--------------------------

రాష్ట్రంలో నాశిరకం మద్యం విక్రయాలు పెరిగాయని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. ప్రజాగళం బహిరంగసభల్లో పాల్గొనేందుకు ఈరోజు ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రాప్తాడులో నిర్వహించిన సభలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. నాశిరకం మద్యం కారణంగా ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా అందించామని.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక ధర సామాన్యులకు భారంగా మారిందని ఆరోపించారు.

--------------------------

నియమ నిబంధనలు ప్రకారం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌ను నిన్న ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి.. ఈవీఎం, బ్యాలెట్ పేపర్, కంట్రోల్ యూనిట్లను ఎలా ఉపయోగించాలో అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లందరికీ ఓటు హక్కును కల్పించే విధంగా తగిన చర్యలు చేపట్టామని, నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అనుకూలంగా ఉండేలా ఏర్పాటు చేశామని తెలియజేశారు.

--------------------------

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఓటు నమోదు, ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ ఆయన ఈరోజు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. బాబు అగ్రహారం నుంచి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటు వేయడం మన హక్కు అని, ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

--------------------------

వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల షెడ్యూల్‌ను భారతీయ రిజర్వ్ బ్యాంక్.. ఆర్‌బీఐ వెల్లడించింది. 2024-25లో ద్రవ్య పరపతి కమిటీ.. ఎంపీసీ తొలి సమావేశం వచ్చే నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరగనుంది. తదుపరి సమావేశం జూన్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగుతుంది. ఆరుగురు సభ్యులు ఉండే ఎంపీసీ సమావేశం 2 రోజుల పాటు జరుగుతుంది.

======================